

సీతారాంపల్లిలో రక్తదాన శిబిరం

నస్పూర్, జనవరి 13: మున్సిపాలిటీ లోని 20వ వార్డు సీతారాంపల్లి కి చెందిన టీం యూనిటీ యువత ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కొరకు శనివారం ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వేణు మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. శిబిరంలో సహకార సంఘం డైరెక్టర్ ధరణి మధు, దేవయ్య, రంగారావు, మోహన్ రావు, వెంకన్న, రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి పదాల రవీందర్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యమే ప్రధాన లక్ష్యం


- నిరుద్యోగ నిర్మూలనకు కృషి
- నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

మందమర్రి టౌన్, జనవరి 13: నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే తన ప్రధాన లక్ష్యమని, ఆ దిశగానే ప్రణాళికలు రూపొందించ బోతున్నానని చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకట స్వామి తెలిపారు. నియోకవర్గంలోని మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యా అందించే విధంగా, మూతపడిన పాఠశాలలను తెరిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. తమ ప్రభుత్వం కూడా విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు. మూతపడిన పాఠశాలలను తిరిగి తెరిపించడానికి ముఖ్యమంత్రి ఫోకస్ పెట్టారని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో నియామకాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలున్నాయని చెప్పారు. పేపర్ లీకేజీల కుంభకోణాలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన సంగతి అందరు చూశారని తెలిపారు. చెన్నూరు ప్రభుత్వం ఆసుపత్రిలో వైద్యుల నియామకాలకు సంబంధించి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తాను ఎన్నికైన వెంటనే జైపూర్ పవర్ ప్లాంటు, బొగ్గు గనులు, డిపార్టుమెంట్‌లలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని సీఎండీని కోరానని చెప్పారు. వెంటనే వాటిని అమలు చేస్తున్నారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి యువతలో ఉన్న నైపుణ్యాలు వెలికి తీసి ఉపాధి అవకాశాలు పెంచుతా మన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా పంట పొలాలు మునిగి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. నియోజ కవర్గ ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల్లో ఒక్కరిగా పని చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రధానంగా నూతన బొగ్గు బావులను ప్రారంభించడానికి సాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఎవరికి సమస్యలు ఉన్నా వెంటనే ఫోన్ కాల్ ద్వారా తమను సంప్రదిస్తే స్పందిస్తానని తెలిపారు.

పులికి ఆవాసం ఏదీ?



జన్నారం మండలంలో పునరావాసానికి ఎంపిక చేసిన దొంగపెల్లి గ్రామం

- టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో కానరాని పులులు
- ప్రత్యేక కారిడార్ ఉన్నా నిరుపయోగం
- గ్రామాలు తరలించడంలో తీవ్ర జాప్యం
- ప్రతిపాదనల దశలోనే తరలింపు ప్రక్రియ

మంచిర్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో అంతరించిపోతున్న వన్యప్రాణుల్లో పులులు మొదటి స్థానంలో ఉన్నాయి. దీన్ని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అటవీ క్షేత్రాలను, అభయారణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా టైగర్‌జోన్‌గా తీర్చిదిద్ది పులులకు ఆవాసం కల్పించాలని కసరత్తు ప్రారంభించారు. మహారాష్ట్ర ఇంద్రావతిలోని తిప్పేశ్వర్, తడోబా టైగర్ రిజర్వు ఫారెస్టులు కవ్వాల్ అభయారణ్యాన్ని ఆనుకొని ఉండటం, ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి పులులు వచ్చి, పోతుంటాయి. దీంతో వాటికి శాశ్వత ఆవాసం కల్పించాలని సంకల్పించారు. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలంతోపాటు నిర్మల్ జిల్లాలోని కడెం మండలాన్ని కవ్వాల్ టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేశారు. జనసం చారం, అలికిడి ఉంటే పులులు నివాసం ఉండవనే ఉద్దేశ్యంతో కవ్వాల్ అటవీ ప్రాంతంలోని గ్రామాలను మైదాన ప్రాంతానికి తరలించాలని నిశ్చయించారు.

గ్రామాల తరలింపునకు..

కవ్వాల్ టైగర్‌జోన్ కోసం సుమారు 15 గ్రామాలను తరలించాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్‌లోని అల్లీనగర్, దొంగపెల్లి, మల్యాలతోపాటు నిర్మల్ జిల్లా కడెం మండలం మైసంపేట, రాంపూర్ గ్రామాలను తరలించేందుకు రంగం సిద్ధంచేశారు. వీటిలో మైసంపేట, రాంపూర్ గ్రామాలను తరలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. అక్కడి ప్రజలకు భూ పట్టాల పంపిణీ కూడా జరిగింది. ఒక్కో కుటుంబానికి రూ. 15 లక్షలు, లేదా అదే ప్యాకేజీలో సరిపడా ఇల్లు నిర్మించడంతోపాటు ఉపాధి కల్పించాలని అధికారులు నిర్ణయించారు.

కడెం మండలంలోని కొత్త మద్దిపడగ శివారులో భూములు కేటాయించి గృహ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోగల అల్లీ నగర్, దొంగపెల్లి, మల్యాల గ్రామాల తరలింపునకు ఇంకా మోక్షం కలగడం లేదు. మూడు గ్రామాల్లో 265 కుటుంబాలు ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. ఈ కుటుంబాలను తరలిస్తేగానీ కవ్వాల్ టైగర్ రిజర్వులో పులి ఆవాసం ఉండే పరిస్థితి లేదు. తరలించే గ్రామాల కింద ఎంపిక చేయడంతో ఇక్కడ ఏళ్లుగా రహదారుల సౌకర్యం లేక పోవడమే గాక విద్య, వైద్యానికి ఇబ్బందులు పడా ల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాగా గ్రామాల తర లింపు కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది.

ఎంపిక చేసిన ఐదు..

కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఎంపిక చేసిన ఐదు గ్రామాలను తరలిస్తేనే ఆవాసయోగ్యానికి అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నా రు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో ప్రస్తుతం 20కి పైగా పులులు తిరుగుతున్నట్లు అధికారులు ధ్రువీకరిస్తున్నారు. గ్రామాలు ఉండటం వల్ల అలికిడికి పులులు ఈ ప్రాంతానికి రాలేకపోతున్నాయి. మరోవైపు ఆదివాసీలు పంటల చుట్టూ ఉచ్చులు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతో పులులు ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నట్లు అధికారులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లోని పశువులు అడవిలోకి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నారు. గ్రామాల తరలింపు జరిగితే ఈ ప్రాంతంలో గడ్డి క్షేత్రాలు పెంచడం వల్ల శాఖాహార జంతువుల సంఖ్య పెరిగి పులులకు వేటాడేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. అలా అవి ఇక్కడ శా శ్వత ఆవాసం ఏర్పాటు చేసుకునేందుకు వీలు కలుగుతుందనే అభిప్రా యాలు వ్యక్తమవుతున్నాయి. పులులకు శాశ్వత మైన ఆవాసం లేనందున మహారాష్ట్ర నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో వాటి రక్షణ పూర్తిగా కరువైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల క్రితం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ సమీపంలోని దారిగాం వద్ద అడవిలో రెండు పులులు మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే.

వాటిలో ఒకదాని మెడకు ఉచ్చు బిగించిన ఆనవాళ్లను అటవీ అధికారులు గుర్తించగా, మరో దానికి విష ప్రయోగం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. శాశ్వత ఆవాసం లేనందున రాకపోకల సమయంలో పులులకు వేటగాళ్ల నుంచి ప్రమాదం పొంచి ఉందనే భావన అధికారుల్లోనూ ఉంది. ఇప్ప టికైనా ప్రభుత్వాలు టైగర్ రిజర్వ్ ఫారెస్టులో శాశ్వత ఆవాసానికి చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సంక్రాంతి సంరంభం

- నేడు భోగి పండుగ - మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి



అందుబాటులో ఉన్న పూజా సామగ్రి

నస్పూర్, జనవరి 13: జిల్లాలో సంక్రాంతి వేడుకలకు ప్రజలు సిద్ధమ య్యారు. ఈ మేరకు ఆదివారం భోగి పండుగను నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భోగి రోజు ప్రత్యేకంగా భోగి మంటలు ఏర్పాటు చేస్తారు. చెడు తొలగిపోయి మనసు శుభ్రం చేసుకుని కొత్తదనంకు స్వాగతం పలికి పాతదాన్ని వదులుకుని, ఇంట్లో మూలాన పడిన వాటిని మార్చివేసి మనసును ఉత్సహంగా నిత్య కొత్తదనంతో లోగిళ్లు కళకళలాడుతాయి. పరమాత్మానుభవమే ఆత్మకు భోగం అందుకే భోగిగా వ్యవహరిస్తారు. మూడు రోజుల పండగలో మొదటి భోగి పండగను ఇంద్రుడి ప్రీతికై జరుపుకుంటారని అభిప్రాయపడుతారు. గోపికలు ఆచరించిన కాత్యాయని వ్రతాన్ని గోదాదేవి నియమ నిష్ఠలతో మాసం రోజుల పాటు ఆచరించి భగవంతుని అనుగ్రహం పొందింది. తన కోసం జీవించిన గోదాదేవిని రంగనాథస్వామి స్వీకరించిన శుభదినమే భోగి పండుగగా పిలువబడుతుంది. వామనావతారంలో ఉన్న మహావిష్ణువు పాతాలానికి తొక్కిన బలి చక్రవర్తి ఏడాదికి ఒకసారి భువిపై వచ్చేది కూడా భోగి అని మరో కథ కూడా ప్రచారం ఉన్నది. బలి చక్రవర్తిని ఆహ్వానించే క్రమంలో వేసిన మంటలు కాలనుగుణంగా భోగి మంటలుగా మారినట్లు చెబుతున్నారు. నాటి రుషులు యజ్ఞం చేసే వారు సకల భోగ భాగ్యాలను ఇస్తుందని యజ్ఞం హోమాగ్ని ప్రతి రూపాల భోగి మంటలని భక్తుల విశ్వాసం.

● ముగ్గులతో అలంకరణ..

ఇతర రోజుల కంటే భోగి రోజున వాకిళ్లు రంగు రంగుల ముగ్గులతో అలంకరిస్తారు. ఇంటి ముందర కళ్లాపి చల్లి ముగ్గు వేసి అందులో రంగులను నింపి ఆవు పేడతో తయారు చేసిన గొబ్బిమ్మలను, రేగుపండ్లను, ధాన్యంను పెట్టడం సంస్కృతి సంప్రదాయం, సృజనాత్మక నిదర్శ నంగా నిలుస్తోంది. భోగి పండ్ల పేరిట దేవుడికి నైవేద్యం పెట్టి ఇరుగు పొరుగు మహిళలకు శనగలను వాయినంగా ఇస్తారు. చిన్న పిల్లలకు చిల్లర నాణేలతో దిష్టి తీసివేయడం, పిల్లలపై పడిన చెడు దృష్టి తొలిగిపోతుందని విశ్వాసం. మంచిర్యాల జిల్లా ప్రజలు సంక్రాంతి సంబరాలను ఆనందోత్సవాలతో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. సంక్రాంతి వచ్చిందంటే ప్రతి ఇంటా పిండి వంటకాలతో ఘుమఘుమలాడుతాయి. పిండి వంటకాలో ఇంటిల్లిపాది, ఇరుగు పొరుగ వారందరు కూర్చుని అవసరమైన అరిసెలు, సకినాలు, లడ్డూలు తదితర వాటిని తయారు చేస్తారు. పండగకు వారం రోజుల ముందుగానే పిండి వంటల తయారిలో మహిళలు నిమగ్నమవుతారు. సంక్రాంతి సందర్భంగా వివిధ రకాల రంగుల అమ్మకాలు జోరుగా జరుగుతాయి. కాగా చిన్నారుల నుంచి పెద్దల వరకు గాలిపటాల ఎగురవేయడంలో పోటీ పడుతారు. అయితే పతంగులకు వినియోగించే నూలు ధారంకు బదులుగా తెగని మాంజా ధారం వాడడం వలన చెట్ల కొమ్మలకు అక్కడక్కడ చిక్కిన పంతగులు ధారం అలాగే ఉండి పోతోంది. అలా మిగిలిన మాంజా దారం వలన అవి పక్షులకు కాళ్ళకు తగిలి ఉండిపోయి చిక్కులు పడి పక్షులు ఎగరకుండా అడ్డుతగలంతో అవి మృత్యువాత పడుతున్నందున మాంజా ధారంపై ప్రభుత్వాలు ఆంక్షలు అమలు విధించాయి. అంతే కాకుండా చైనా మాంజా ధారం కూడా మార్కెట్లో చలామణీ అవుతున్నందున దానిపై నిషేధం అమలులో ఉంది.



ముగ్గులకు వినియోగించే వివిధ రకాల రంగులు



మందమర్రిలో రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మందమర్రి టౌన్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో రంగులకు గిరాకీ పెరిగింది. శనివారం మార్కెట్ సెంటర్లో రంగులు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఆసక్తి చూపారు. ఆదివారం భోగి, ఉన్నందున పెద్ద ఎత్తున మహిళలు కొనుగోలు చేశారు.

పల్లవి ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్లు



ఆపరేషన్ చేయించుకున్న వారితో వైద్యులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 13: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలోని పల్లవి ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్లు నిర్వాహిస్తున్నామని వైద్యులు డాక్టర్ రాజు తెలిపారు. శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ రాజు మాట్లాడారు. ఉత్తర తెలంగాణలోనే ఇలిజారోవ్ ఫిక్సేషన్ పద్ధతిని అనుసరించి లింబ్ సేవింగ్ సర్జరీలను చేస్తున్న ఏకైక ఆస్పత్రి తమదేనని తెలిపారు. ఈ పద్ధతిలో లింబ్ లెంతనింగ్ (ఎముకల పొడవు పెంచడం), డిఫార్మిటీ కరెక్షన్ (వంకర కాళ్ల సరి చేయడం), ఇన్‌ఫెక్షన్ నాన్ యూనియన్ (ఇన్‌ఫెక్షన్ వల్ల సరిగ్గా అతుక్కోని ఎముకలను అతుక్కునేలా చేయడం) లాంటి అత్యంత క్లిష్టమైన సర్జరీలను నిర్వహించి ఎముకల సంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారం చూపుతున్నామని వివరించారు. వారం రోజుల వ్యవధిలో ఇలిజారోవ్ ఫిక్సేషన్ ద్వారా కన్నెపల్లి మండలానికి చెందిన దుర్గమ్మ (75), బొక్కలగుట్టప్రాంతానికి చెందిన తిరుపతి (45), సీసీసీ నస్పూర్‌కు చెందిన అంజమ్మ (60), కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణికి చెందిన లక్ష్మీనారాయణ (40) అనే రోగులకు ఆపరేషన్‌లు చేసి వారి సమస్యలకు పరిష్కారం చూపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సాయిశృజ, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

రామకృష్ణాపూర్, జనవరి 13: క్యాతన్‌పల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిని భూలక్ష్మీ-స్రవంతి, ద్వితీయ బహుమతిని హర్షిత-హస్మిత, తృతీయ బహుమతిని వర్ష-సరితలు గెలుచుకున్నారు. పాల్గొన్న అందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహేందర్, సంతోష్, స్వామి, శివకుమార్, గ్రామ పెద్దలు సత్యం, ఓదెలు, లక్ష్మణ్, వీరేశం, మురళీ, యువకులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామంలో దొంద సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను ఎస్సై రాజశేఖర్ ప్రారంభించారు. మొదటి, ద్వితీయ, తృతీయ విజేత లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దొంద సంపత్, పెంచాల రాజు, బాలకృష్ణస్వామి, పెంచాల రంజిత్, రాములు, పెంచాల శ్రీనివాస్, ఈద లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

హాజీపూర్, జనవరి 13: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, వెరబెల్లి స్రవంతిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు అందమైన ముగ్గులు వేసి అలరించారు. అనంతరం విజేతలైన ముగ్గురు మహిళలకు నగదు బహుమతితో పాటు పాల్గొన్న అందరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాధవరపు వెంకటరమణ రావు, గ్రామ సర్పంచు జూపాక రాజేశ్వరి, ధర్మయ్య, మడిపల్లి సత్యం, గడ్డం స్వామిరెడ్డి, బొడ్డు తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌తో ప్రాణహాని

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కౌన్సిలర్

బెల్లంపల్లి, జనవరి 13: వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ తనకు ఫోన్ చేసి దుర్భాషలాడుతూ బూతులు తిడుతూ బెదిరిస్తున్నాడని, అతడితో ప్రాణహానీ ఉందని శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 20వ వార్డు కౌన్సిలర్ గోసిక రమేశ్ ఫిర్యాదు చేశారు. ఉదయం బత్తుల సుదర్శన్ తనకు ఫోన్ చేసి కులం పేరుతూ దూషిస్తూ బూతులు తిట్టాడని, మనుషులను పంపించి చంపుతానని బెదిరించాడని వివరించాడు. అతనితో పాటు అతని అనుచరులతో తనకు, తన కుటుంబానికి ప్రాణహానీ ఉందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. వైస్ చైర్మన్ సుదర్శన్‌పై కేసు నమోదు చేసి తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో కోరారు. ఈ విషయంపై వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ వివరణ కోరగా కౌన్సిలర్ గోసిక రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సంఘానికి చేసిన సేవలు మరువలేనివి

దండేపల్లి, జనవరి 13 : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు మచ్చ ప్రభాకర్‌రావు, పద్మశాలి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు రామ శ్రీనివాసులు పద్మశాలి సంఘానికి చేసిన సేవలు మరువలేనవని సంఘం మండల అధ్యక్షుడు వడ్డెపల్లి దేవయ్య, దండేపల్లి పట్టణ అధ్యక్షులు వోడ్నాల శంకర్ కొనియాడారు. ఇటీవల గుండెపోటుతో ప్రభాకర్, శ్రీనివాసులు మృతి చెందడంతో పద్మశాలి సంఘం నాయకులు శనివారం సంతాపసభ ఏర్పాటు చేసి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళుర్పించారు.. కార్యక్రమంలో బొల్లి శ్రీనివాస్, ఎనగందుల రామస్వామి, సత్యం, తిరుపతి, మురళీ, లింగన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి గ్రామ కార్యవర్గం

జన్నారం, జనవరి 13: మండలంలోని కామన్‌పల్లి గ్రామ గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడిజుట్టు నరేష్, ఉపాధ్యక్షుడిగా పంచర్పుల మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా జాడి కిరణ్, క్యాషియర్‌గా సాట్ల సత్యం ఎన్నికయ్యారు. అకౌంటెంట్‌గా కొలిమికుంట్ల రమణచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాళ్లపల్లి రమేష్, కార్యదర్శిగా వంగాల శేఖర్, ముఖ్య సలహాదారులుగా చాట్ల తిరుపతి, జునుగురు వెంకటేష్, బోర్లకుంట వెంకటేష్, ప్రచార కార్యదర్శులుగా జునుగురు రామన్న, జాడి భాస్కర్, కత్తిరిపాక రాజేష్, సలహాదారులుగా కేతనేని చిలకలయ్య, భుక్య శ్రీనివాస్, దుర్గం శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె అందజేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 13: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంచిర్యాల పట్టణాన్నిపరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డు సమస్యలు తెలుసుకోవడానికి పౌర సమాజ కమిటీలను వేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ సభ్యులు పారిశుధ్యం విషయంలో సంతృప్తి చెందితేనే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని ఖరాకండీగా చెప్పారు. సక్రమంగా విధులునిర్వహిస్తే హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిలో వేతనాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రావుల ఉప్పలయ్య, సల్ల మహేష్‌మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పోచమ్మ చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే

ఏసీసీ, జనవరి 13: మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడ పోచమ్మ చెరువు కట్టను శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా డ్వాక్రా గ్రూపు మహిళ భవన నిర్మాణానికి చెరువు కట్ట పక్కన స్థల పరిశీలన చేశారు. చెరువు కట్ట వద్ద వాకర్స్ అసోసియేసన్ సభ్యులకు , డ్వాక్రా గ్రూపు మహిళలకు భవనాల నిర్మాణాల కోసం స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తూముల నరేష్, పూదరి తిరుపతి, చిట్ల సత్యనారాయణ, పూదరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొనకల్ సొసైటీ చైర్మన్ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

జన్నారం, జనవరి 13 : తనపై కొంత మంది డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే మంజూరు చేసిందని పొనకల్ సహకార సంఘం చైర్మన్ శీలం రమేశ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 6న తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కొందరు డైరెక్టర్లు జిల్లా ఇన్‌చార్జీ డీసీవో శ్రీనివాస్‌రెడ్డితో పాటు హైద్రాబాద్‌లోని కో ఆపరేటివ్ స్టేట్ కమిషనర్ వినతి పత్ర అందజేశారని చెప్పారు. డైరెక్టర్‌ల ఫిర్యాదు మేరకు తనకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. నోటీసులపై తాను హైకోర్టుకు వెళ్లడంతో స్టే మంజూరు చేసిందన్నారు. నాలుగేళ్ల పదవీ కాలంలో రైతులకు ఎలాం టి ఇబ్బందులు కలుగకుండా డైరెక్టర్ల సహకారంతో విత్తనాలు, ఎరువులు అందజేశామని తెలిపారు. తనకు సరిపడా డైరెక్టర్ల మద్దతు ఉందని తెలిపారు.

పండ్లు పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 13: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు లయన్ మెల్విన్ జోన్స్ జన్మదినం సందర్భంగా శనివారం మంచిర్యాలలోని మాతా శిశు కేంద్రం ఆసుపత్రిలో గర్భిణులకు లయన్స్‌క్లబ్ సభ్యులు పండ్లుబ్రెడ్‌లు పంపిణీ చేశారు. అలాగే సీనియర్ లయన్‌మెంబర్ హన్మంతరావు మనవడు విహాన్ జన్మదినం సందర్భంగా 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ మంచిర్యాల అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం చైర్మన్ హన్మంతరావు, సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

- విజేతగా ఫ్రెండ్స్ లెవెన్ జట్టు
- బహుమతులు అందజేసిన నిర్వాహకులు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి, జనవరి 13: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన నాతరి స్వామి బెల్లంపల్లి నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రెండ్స్ లెవెన్, మార్నింగ్ వాకర్స్ జట్లు తలపడ్డాయి. ఫ్రెండ్స్ లెవెన్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు నాతరి స్వామి రూ. 44,444, రన్నర్ జట్టుకు రూ. 22,222 నగదు బహుమతి అందజేశారు. ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్ హాజరై బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను నిర్వహించడం వల్ల యువతలో నైపుణ్యం వెలికి తీసే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు ఉద్యోగాలు సాధించిన సమయంలోనూ క్రీడాకారులకు అవకాశాలు ఉంటాయని చెప్పారు. అనంతరం నాతరి స్వామిని గజమాల, శాలువాలతో నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తొంగల మల్లేష్, రవి, వెంకటేష్, మహేష్, దామస్, రాజలింగు, శేఖర్, రాజలింగు, సుధాకర్, లక్ష్మణ్, బాలుయాదవ్, చెన్నూరని సమ్మ య్య, ఇమ్రాన్, కిషన్, కుమార్, గోపాల్, రాజేష్, భూమయ్య, మహేష్, ఖలీల్, అరుణ్, విజయ్, సమత్, శ్రీనివాస్‌నర్సయ్య, ఉస్మాన్ పాషా, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై దీకొండ రమేష్

సిర్పూర్(టి), జనవరి 13: రౌడీషీటర్లు, సస్పెక్ట్, హిస్టరీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని ఎస్సై దీకొండ రమేష్ అన్నారు. శనివారం సిర్పూర్(టి) పోలీసు స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లు, సస్పెక్ట్, హిస్టరీ షీటర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరి కదిలికలపై నిఘా పెట్టామన్నారు. ఎక్కడైనా గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని నేర ప్రవృత్తి వీడి మంచి ప్రవర్తనతో కుటుంబ సభ్యులతో కలిసి జీవించాలన్నారు. నేర ప్రవృత్తి వీడకపోతే పీడీ యాక్టు తప్పదని అన్నారు. ప్రజాజీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. అనవసరమైన గొడవలు, కొట్లాటల జోలికి పోయి మీజీవితాన్ని నాశనం చేసుకోవద్దని హెచ్చ రించారు. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉండాలని అన్నారు. అనంతరం భూపాలపట్నం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులు

ఆసిఫాబాద్, జనవరి 13: ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని స్వర్ణ, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్‌కలీల్ తెలిపారు. ఈనెల12తేదీల్లో మహబూబ్ నగర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాఠశాలకు చెందిన ఎర్ర వినీల్ జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించగా అండర్-19 విభాగంలో ఇంటర్ విద్యార్థులు అంజన్న, అభిసాయి కాంస్యపతకం సాధించారన్నారు. అదేవిధంగా సీనియర్ బాలికల విభాగంలో విద్యార్థినులు దియాసర్కార్, హర్షిత, వైష్ణవి తృతీయస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ తిరుపతి, నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్షుడు అలీబీస్ అహ్మద్, ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్ ప్రేంకుమార్ అభినందించారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

బెల్లంపల్లి, జనవరి 13: యువత క్రీడలపై దృష్టిసారించాలని పలువురు నాయకులు అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం ఉమ్మడిఆదిలాబాద్ జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, అర్జున్ చెస్ అకాడమీఫౌండర్, అధ్యక్షుడు కోట సుధాకర్, బూడిది గోపాలకృష్ణ, కుమరంభీంజిల్లా సంస్కృతిక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచిభవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ కోచ్‌లు స్వరూప, హిమబిందు, రాజేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారు అండర్-7,9,11,13,15, ఓపెన్‌టూఆల్ బాయ్స్ అండ్ గర్ల్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్తీక్, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం



సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వర కట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్ర హించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సులో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లానని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకుపోవడంతో మంటలు చెలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కొమ్ముల బాపు

కాసిపేట, జనవరి 13: ఆదివాసీ హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి అమరుడైన రొడ్డ చిన్నరమేశ్ స్మారకార్థం మండలంలోని దేవాపూర్‌లో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను శనివారం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కొమ్ముల బాపు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రొడ్డ చిన్నరమేశ్ స్మారకార్థం వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మండల స్థాయి పోటీల్లో 20 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవాపూర్ సర్పంచు మడావి తిరుమల అనంతరావు, మద్దిమాడ సర్పంచు ఆడె జంగు, భీంరావు, బద్ది శ్రీనివాస్, రొడ్డ కిష్టయ్య, సిడాం రాందాస్, రొడ్డ రాజం, రమణారెడ్డి, భీమయ్య, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలి



మారం జగదీశ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

నస్పూర్, జనవరి 13: సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మారం జగదీశ్ సూచించారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన మారం జగదీశ్‌ను మంచిర్యాల జిల్లాకు చెందిన వివిధ శాఖల ఉద్యోగులు శనివారం కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్ర మంలో తిరుపతి, రామ్ కుమార్, మల్లేష్, అంజయ్య, కుమారస్వామి, అబూ, విజయ్, కే. తిరుపతి, జమీర్, సంజీవ్ రావు, అంజు, గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

- మాజీ విప్, కాంగ్రెస్ నాయకుడు నల్లాల ఓదెలు

మందమర్రిరూరల్, జనవరి 13: గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని మాజీ ప్రభుత్వ విప్, కాంగ్రెస్ నాయకుడు నల్లాల ఓదెలు అన్నారు. స్వర్గీయ గడ్డం వెంకటస్వామి స్మారకార్థం సారంగపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా కారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి టోర్నమెంట్ నిర్వహించ డం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వహకులు చిప్పకుర్తి శ్రీనివాస్, శివకుమార్,కిశోర్,కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు పైడిమల్ల నర్సింగ్, తిరుమల్‌రెడ్డి,కమల్ మనోహర్‌రావు, చంద్రకళ, రాములు, రాయమల్లు, దాసరి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ రేస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

హాజీపూర్, జనవరి 13: హాజీపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ రేస్ పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. మండలంలోని బుగ్గగట్టు వద్ద నిర్వహించిన సైకిల్ రేస్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎస్సై నరేష్, ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. ఐదు విభాగాల్లో జరిగిన ఈ పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి.చుట్టు పక్కల నుంచి గ్రామాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు వచ్చి పోటీలను వీక్షించారు. ప్రతి విభాగంలో మొదటి బహుమతి షీల్డ్‌తో పాటు రూ. 2 వేల నగదు, రెండో బహుమతి షీల్డ్‌తో పాటు వెయ్యి రూపాయల నగదు అందజేశారు. 1, 2 తరగతుల విభాగంలో మొదటి బహుమతి కొత్తపల్లి ఆశిష్, రెండో బహుమతి ఎనగందుల విశాల్‌లు గెలుపొందారు. 3, 4 తరగతుల విభాగంలో మొదటి బహుమతి జేబీ అద్నాన్, రెండో బహుమతి స్నేహిత్ గెలుపొందారు. 5, 6 తరగతుల విభాగంలో గోపు చరణ్‌కుమార్, రెండో బహుమతి అఖిల్‌లు గెలుపొందారు. 7,8 తరగతుల విభాగంలో ఫైనల్ రేసులో ఇద్దరు ఒకేసారి రీచ్ కావడంతో ఉత్కంఠకు దారి తీసింది. దీంతో వీడియో ఫుటేజీ ఆధారంగా ఎంపైర్‌లు విజేతను ప్రకటించారు. పోటీలకు స్పాన్సర్లుగా ఎంపీపీ మందపల్లి స్వర్ణలతశ్రీనివాస్, జడ్పీటీసీ పుస్కూరి శిల్పశ్రీనివాస్‌రావు, గుడిపేట సర్పంచు లగిశెట్టి లక్ష్మీరాజయ్య, కందుల రమేష్, శ్రీనివాస్‌గౌడ్, బేర పోచయ్య, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, అత్తె శ్రీనివాస్‌లు ఉండి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి, బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, సీపీఐ మండల కార్యదర్శి దేవి పోచన్న, ముడిమడుగుల శ్రీనివాస్, మట్టపల్లి సత్యనారాయణ, ఏఎస్ఐ చాంద్‌పాషా పాల్గొన్నారు.

'పనులు నాసిరకంగా చేపడుతున్నా పట్టింపు లేదు'

కన్నెపల్లి, జనవరి 13: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలను నాసిరకంగా చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శనివారం మరుగుదొడ్ల నిర్మాణాలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విద్యార్థుల సౌకర్యార్థం నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులు స్థానిక సర్పంచ్ భర్త నాణ్యత లేకుండా చేయిస్తునారని తెలిపారు. ఉన్నతాధికారులు పరిశీలించి నాణ్యతతో నిర్మించేలా చూడాలని కోరారు. ఉన్నతాధికారులు పట్టించుకోక పోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోమాస డాగయ్య, సురేష్, మొండి పాల్గొన్నారు.

అయ్యప్పలకు ముస్లింల భిక్ష

రామకృష్ణాపూర్, జనవరి 13: రామకృష్ణాపూర్ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు శనివారం స్థానిక రామాలయంలో భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ అజీజ్, నజీరుద్దీన్, షఫీ, పాషా, గౌస్, ఎస్ఐ రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు పల్లె రాజు, రఘునాథ్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు మందులు పంపిణీ

జన్నారం, జనవరి 13: గొర్రెలు పొందిన లబ్ధిదారులకు శనివారం మండల పశువైద్యుడు శ్రీకాంత్ మందులను అందజేశారు. కార్యక్రమంలో మండల యాదవ సంఘం అధ్యక్షుడు జక్కుల తిరుపతియాదవ్, నరేష్‌యాదవ్, మహేష్‌యాదవ్, యాదవులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు అందజేత

కాసిపేట, జనవరి 13: ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీవీటీజీలకు ఉచితంగా విద్యుత్ మీటర్లను శనివారం విద్యుత్ శాఖ అధికారులు అందజేశారు. విద్యుత్ ఎస్ఈ శేషారావు మాట్లాడుతూ ఎస్టీ తెగల్లో అత్యంత వెనకబడిన పీవీటీజీల (కొలాం, తోటి)కు కేంద్రం ఉచితంగా విద్యుత్ మీటర్లు అందజేసి ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇళ్లు ఉన్న పీవీటీజీలకు ఉచితంగా మీటర్లు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ రాజన్న, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

లక్షెట్టిపేట రూరల్, జనవరి 13: యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని తాము ఎన్నుకున్న రంగాల్లో రాణించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కోరారు.లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వెరబెల్లి రఘునాథ్ ఫౌండేషన్ చైర్మన్ వెరబెల్లి రఘునాథ్ రావు ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. శనివారం పోటీలు ముగిసిపోవడంతో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఫైనల్స్‌లో గెలుపొందిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతితోపాటు ట్రోఫీ, రన్నర్స్ జట్టుకు రూ.5 వేలు ట్రోఫీలను రఘునాథ్‌రావు ఎమ్మెల్యేతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్ మండల అధ్యక్షుడు బొప్పు కిషన్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి రమేష్‌చంద్ మధు ప్రభాకర్ శివశంకర్ రమేష్ రత్నం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మినరల్ వాటర్ ప్లాంట్



జైపూర్‌లో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

జైపూర్, జనవరి 13: మండల కేంద్రంలో ఎస్టీపీపీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంది. 2018 లో సు మారు రూ. 8 లక్షలతో మండల ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కాగా రెండేళ్ల క్రితం ప్లాంట్ చెడిపోవడంతో మండలంలోని ప్రజలు సురక్షిత నీటికోసం ఇబ్బందులు పడుతు న్నారు. సింగరేణి అధికారులు, పంచాయతీ అధికారులకు మొర పెట్టుకున్నా వాటర్ ప్లాంట్‌కు మరమ్మ తులు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్లాంట్‌ను గత పాలకులు పట్టించుకోలేదని, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీరామ పూజిత అంక్షితల పంపిణీ

దండేపల్లి,జనవరి 13: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరామ పూజిత అంక్షితలను దండేపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. భక్తులు శోభాయాత్ర చేపట్టి స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కేంద్ర పథకాలపై అవగాహన

దండేపల్లి, జనవరి 13: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వికాసిత్ భారత సంకల్ప యాత్రలో భాగంగా దండేపల్లిలో శనివారం ప్రచార రథంలో వీడియో ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ . ఐదేళ్ల పాటు ప్రజలందరికి ఉచితంగా రేషన్ బియ్యం అందించాలని నిర్ణయం హర్షణీయమని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలండర్ ఆవిష్కరణ

మందమర్రి టౌన్, జనవరి 13: మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిపై శనివారం 2024 సింగరేణి క్యాలండర్‌ను గని మేనేజర్ భూశంక రయ్య, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, కంది శ్రీనివాస్ ఆవిష్కరించారు. కంది శ్రీనివాస్ మాట్లాడుతూ 850 మందికి క్యాలెండర్ పంపిణీ చేయనున్నామని తెలిపారు.

దళిత క్రైస్తవ దండోరా రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా సతీష్‌కుమార్


బెల్లంపల్లి, జనవరి 13: దళిత క్రైస్తవ దండోరా తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా బెల్లంపల్లి పట్టణానికి చెందిన కాశీ సతీష్‌కుమార్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం హైద్రాబాద్‌లో రాష్ట్ర నాయకులు సతీష్‌కుమార్‌కు నియామక పత్రం అందజేశారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్

నెన్నెల, జనవరి 13: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మండల అధ్యక్షుడిగా మైలారం గ్రామానికి చెందిన వేల్పుల రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, మండల ఇన్‌చార్జీ గోగర్ల శేఖర్‌ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దైదల సమ్మయ్య, ప్రధానకార్యదర్శిగా సగందు ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా లింగంపల్లి మనోజ్‌కుమార్, కార్యదర్శిగా సుందిళ్ల రాకేష్, సంయుక్త కార్యదర్శిగా చిప్పకుర్తి మహేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జీ గుండా థామస్, లేతకారి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



పండుగ వేళ.. ధరల మోత



● భగ్గుమంటున్న నిత్యావసరాల రేట్లు ● బియ్యం నుంచి అన్నింటి ధరలు ఆకాశంలోనే

వాంకిడి, జనవరి 13: పండుగ ఏదైనా ప్రతి తెలుగింట్లో పిండి వంటల ఘుమఘుమలు సర్వ సాధారణం. అందులోనూ దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండుగలను పేద, మధ్య తరగతి ప్రజలు సైతం ఉన్నంతలో జరుపుకుం టారు. అయితే ఈ సారి సంక్రాంతికి పేద, మధ్య తరగతి ప్రజలపై బియ్యం నుంచి పప్పులు, బెల్లం వంటి నిత్యావసరాల ధరలభారం భారీగానే పడనుంది. ఆరు నెలల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం నిత్యావసరాల ధరలన్నీ ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయలు, గుడ్ల ధరలు సైతం కొండెక్కడంతో సామాన్యులు పండుగ చేసుకోవాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెరిగిన ధరల కారణంగా ప్రతి ఇంటి నెలవారీ ఖర్చు భారీగా పెరిగి సామాన్యులకు ఇబ్బందికరంగా మారింది.

కంటతడి పెట్టిస్తున్న కందిపప్పు..

ప్రతి ఇంట్లో నిత్యం వాడే కందిపప్పు ధర కంటతడి పెట్టిస్తోంది. ఆరు నెలల క్రితం రూ.120 ఉన్న కందిపప్పు ధర ప్రస్తుతం రూ.180నుంచి 200 వరకు విక్రయిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం కంది సాగుదశలో ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి పప్పును దిగుమతి చేస్తున్నారు. దీంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

భగ్గుమంటున్న బియ్యం...

బియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. ఆరు నెల ల క్రితం కిలో రూ.50సన్న బియ్యం ప్రస్తుతం రూ.65కు చేరాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై ప్రతినెల రూ.400మేర అదనపు భారం పడుతోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలు సన్నబియ్యం తినలేని పరిస్థితి నెలకొంది.

కూరగాయాలు..

ఇక పండుగ వేళ కూరగాయల ధరలు భగ్గు మంటున్నాయి. మూడు నెలల క్రితం అందుబాటులోనే ఉన్న కూరగాయల ధరలు ప్రస్తుతం టమాట మినహా మిగిలినవన్నీ కిలో రూ. 80పైనే ఉన్నాయి. బీరకాయ, చిక్కుడుకాయ, వంకాయ, బెండకాయలు, పచ్చిమిర్చి, కారకాయ, దొండకా య కూరగాయాలు రూ.80పైనే ఉన్నాయి.

అల్లం, వెల్లుల్లిది అదే దారి..

ఏ కూర చేయాలన్నా రుచి కోసం అల్లం, వెల్లుల్లి వాడాల్సిందే. అయితే ఆరు నెలల క్రితం తక్కువ ధరలో విక్రయించిన అల్లం, వెల్లుల్లి ధర ప్రస్తుతం అందనంత ఎత్తులో ఉంది. ముఖ్యంగా వెల్లుల్లి ధర రూ.120నుంచి అమాంతంగా పెరిగి ప్రస్తుతం కిలో రూ.300కు చేరింది. అల్లం ధర సైతం రూ.70నుంచి 160పెరిగింది.

ఊరట నిస్తున్న వంట నూనెలు..

అన్ని నిత్యావసరల ధరలు ఆకాశాన్ని అంటు తున్నా.. వంట నూనెల ధరలు మాత్రం తగ్గు ముఖం పట్టడం ప్రజలకు కొంత ఊరటనిస్తోంది. ఆరు నెలల క్రితం రూ.160కిపైగా ఉన్న సన్‌ఫ్లవర్ నూనె ధర ప్రస్తుతం రూ.115కు లభిస్తోంది. పామాయిల్, వేరుశనగ నూనె, రైస్‌బ్రాన్ నూనెల ధరలు సైతం గతంతో పోలిస్తే తక్కువ ధరకే లభ్యమ వుతున్నాయి.

కొండెక్కిన గోడి గుడ్డు..

అధిక ప్రోటీన్లు ఉన్న కారణంగా పిల్లలకు ప్రతి రోజు ఒకగుడ్డు పెడుతున్నారు. ఆరు నెలల క్రితం రూ.5 ఉన్న ఒక కోడి గుడ్డు ధర ప్రస్తుతం రూ. 7కు చేరింది. దీంతో సామాన్య ప్రజలు కనీసం కోడిగుడ్డును తినలేని పరిస్థితి తయారైంది.

జంగు పటేల్ సేవలు మరువలేనివి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

కెరమెరి, జనవరి 13: స్వర్గీయ పెందోర్ జంగు పటేల్ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శనివారం మండలంలోని చిన్నసాకడ గ్రామంలో నిర్వహించిన పెందూర్ జంగు పటేల్ స్మారక కబడ్డీ 24వ క్రీడోత్సవాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామస్థులు వారికి ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జంగుపటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతీరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, సర్పంచ్‌లు సుమిత్రబాయి, నిర్వాహకులు ఆనందరావు, దాంబీరావు, శ్రీనివాస్, తుకారాం, సోము, వినేష్, భరత్, తదిరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ



బెజ్జూరు మండలం నాగులవాయిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్, జనవరి 13: మండలంలోని బూర్గుడ గ్రామంలో శనివారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేశారు. మొదట పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రగా పల్లకీ ఊరేగింపు నిర్వ హించి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శోభా యాత్రలో మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున యువకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండలంలోని నాగులవాయి గ్రామంలో శనివారం అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర ఘనంగా నిర్వహిం చారు. భాజాభజంత్రీలు, శ్రీరామనామస్మరణతో వైభవంగా శోభా యాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు.

పర్సన్ ఇన్‌చార్జిగా సర్పంచ్‌లనే నియమించాలి

తిర్యాణి, జనవరి 13: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో మళ్లీ ఎన్నికలు జరిగేవరకు పర్సన్ ఇన్‌చార్జిగా సర్పంచ్‌లనే నియమించాలని సర్పంచ్‌ల సంఘంజిల్లా అధ్యక్షుడు గుణవంతరావు కోరారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఈనెల 31తో సర్పంచ్‌ల గడువు పూర్తవుతుందన్నారు. ఎన్నికల కోడ్ రాక ముందే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

సర్పంచ్‌ల పదవీ కాలం పొడిగించాలి

కెరమెరి/వాంకిడి: గ్రామపంచాయతీ సర్పంచ్‌ల కాలం ఈ నెల 31తో ముగుస్తున్న నేపథ్యంలో జూన్31 వరకు పొడిగించాలని సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షులు నానేశ్వర్, తుకారాం కోరారు. ఉప సర్పంచ్‌లతో ఉన్న జాయింట్ చెక్‌పవర్ రద్దుచేసి సర్పంచ్, కార్యదర్శికి అప్పచెప్పాలని, గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచ్‌లు జగన్నాథ్‌రావు, నారాయణ, బాలాజీ, లాల్‌షావ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆన్‌లైన్ సేవలు

జైనూర్, జనవరి 13: మారుమూల గ్రామాల్లో ఆన్‌లైన్ సేవలు కల్పిస్తున్నట్లు మీ సేవా నిర్వాహకులు ముబారక్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని గూడమామడా పంచాయతీలో గల కొలాంగూడలో ఆదివాసులకు ఆధార్‌కార్డు అప్‌డేట్ చేశారు. గ్రామసర్పంచ్ కుంర కేశవ్‌రావ్ ఆన్‌లైన్ సేవలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మారుమూల గ్రామాల గిరిజనులు మండల కేంద్రానికి రాకపోకలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామాల్లోనే ఆన్‌లైన్‌సేవల్ని అందజేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ సేవలు గ్రామాల్లో నిర్వహించడంపై ఆదివాసులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఎంపీటీసీ జుగాదిరావ్, ఉపసర్పంచ్ సలీం పాల్గొన్నారు.

కుమరం భీం స్ఫూర్తితో రాజ్యాధికారం సాధించాలి

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



కుమరం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

చింతలమానేపల్లి, జనవరి 13: కుమరంభీం స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం చింతలమానేపల్లి మండలం అంబగట్టులో ఆదివాసీ సంఘాలతో కలిసి పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కుమరంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు నివసించే ఏజెన్సీ ప్రాంతాల్లో అదాని, అంబానీలు అక్రమంగా మైనింగ్ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలు స్థిరనివాసం కూడా లేని దుస్థితిలో బతుకుతున్నారన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. భీం పోరాడిసాధించిన హక్కులను, చట్టాలను ఆధిపత్య పాలకులు తుంగలో తొక్కి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పీసా, 1/70 చట్టం, జీవో నెం.3 లాంటి హక్కులను చట్టాలను ఆదివాసీలకు చెందకుండా పాల కులు కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఆదివాసీ గొంతుకలపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపరిషత్ చైర్మన్‌లుగా ఎస్టీలను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం తక్షణమే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. పంచాయ తీరాజ్ చట్టంప్రకారం ఏజెన్సీ ఏరియాలో ఎస్టీలకు రిజర్వు చేయబడ్డ జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాల్లో జనరల్ కేటగిరికి చెందిన జడ్పీ వైస్‌చైర్మన్‌లు తాత్కాలిక చైర్మన్‌లుగా నియమించడం ఎస్టీ రాజ కీయ హక్కులను కాలరాయడమేన్నారు. కార్యక్ర మంలో నాయకులు సిడాం గణపతి, శ్యాంరావు, చిన్నన్న, జ్యోతి, శ్యాంరావు, రాజ్‌కుమార్, వెంకటేష్, లాంచు, బందు, నీలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, జనవరి 13: ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు ఆయ నను సత్కరించారు. ఆయనవెంట మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ ఉన్నారు.



కొండగట్టు అంజన్న సన్నిధిలో హరీష్‌బాబు

బోరు వేయించిన సర్పంచి



బోర్ వేయిస్తున్న సర్పంచి సుమలత శ్రీధర్‌రెడ్డి

రెబ్బెన, జనవరి 13: రెబ్బెన గోలేటి గ్రామ పంచాయతీ భగత్‌సింగ్‌నగర్ 7వ వార్డులో సర్పంచి సుమలతశ్రీధర్‌రెడ్డి బోర్ వేయించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేష్, ఎర్ర స్వప్న, సంతోష్, సత్తయ్య, శంకర్, పరదేశి, నారాయణ, వెంకటేష్, రవి, సుమన్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం



లయన్స్‌క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న అధ్యక్షుడు తారీక్

ఆసిఫాబాద్, జనవవరి 13: లయన్స్‌క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామని అధ్యక్షుడు తారీక్ అన్నారు. సంఘ భవనంలో శనివారం లయన్స్‌క్లబ్ ఫౌండర్ మెల్విన్‌జోన్స్ జయంతిని పురస్కరిం చుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెల్విన్‌జోన్స్ ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో లయన్స్ క్లబ్‌లను విస్తరించి ఎంతో మందికి సేవలందించడంలో కృషి చేశారని కొనియాడారు. రాబోయే రోజుల్లో ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ సభ్యులు ఆంజనే యులు, వెంకటరమణారెడ్డి, శంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు శంకర్, సంజయ్‌కుమార్, వేణుగోపాల్, వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు ప్రారంభం

కౌటాల, జనవరి 13: మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాలలో గ్రామీణస్థాయి కబడ్డీ పోటీలు ఈ నెల14,15,16 తేదీల్లో నిర్వహిస్తామని నిర్వాహకులు శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో మొదటి బహుమతి రూ.21,111, ద్వితీయ బహుమతి రూ.11,116, తృతీయ బహుమతి రూ.5,111 అందజేస్తామన్నారు.

ఘనంగా గోదారంగనాథ స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాగజ్‌నగర్, జనవరి 13: కాగజ్‌నగర్ పట్టణంలో రాజస్థాన్ భవన్‌లో శనివారం గోదారంగనాథస్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సవాన్ని శ్రీగోవిందచారి స్వామి, శంకర్‌సాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం పట్టణ పురవీధుల్లో పల్లకిలో స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



స్వామిని, అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపులి కనిపించిందని పుకార్లు

చింతలమానేపల్లి, జనవరి 13: మండలంలోని దిందా గ్రామసమీపంలోగల పత్తి చేనులోకి పెద్దపులి వచ్చిందని పుకార్లు రావడంతో పత్తి ఏరడానికి వెళ్లిన కూలీలు తిరిగి ఇంటికివచ్చారు. విషయం తెలుసుకున్న అటవీశాఖఅధికారులు అటవీ ప్రాంత పత్తిచేనుల్లో పులి పాదముద్రలను గుర్తించేందుకు కలియదిరిగారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి పాదముద్రలు లభించలేదని హైనాగా భావిస్తున్నట్లు అటవీశాఖ అధికారి ఒకరు తెలిపారు.

సోషల్ మీడియాలో పులి పాత ఫొటోలు వైరల్

కాగజ్‌నగర్, జనవరి 13: కాగజ్‌నగర్ దరిగాం అడవుల్లో రెండు పులుల మృత్యువాత సంచలనం రేకెత్తించింది. అయితే ఇదే అదునుగా ఇందుకు సంబంధించిన ఫొటోలంటూ కొందరూ పాతచిత్రాలను సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు పాత ఫొటోలుగా తెలుస్తోంది.



దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 13: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్ట్‌కార్మికసంఘం (ఏఐటీయూసీ),(ఐఎఫ్‌టీయూ)నాయకులు శనివారం సీఎండీ ఎన్ బలరాంకు వినతిపత్రాలు అందించారు. శనివారం ఆయన నస్పూర్ డిస్పెన్సరీని సందర్శించగా, ఆయనకు యూనియన్ల నాయకులు వినతిపత్రం అందజేసి పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం మాట్లాడారు. సెప్టెంబర్ 2022లో తాము సమ్మెచేసిన సమయంలో యాజ మాన్యంతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్‌కమిటీ వేతనాలు అమలుచేయాలని, లాభాలవాటా చెల్లించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని, సెలవులు మంజూరు చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. కాంట్రాక్టు కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, 11వ పీఆర్‌సీలో భాగంగా ఇతర సంస్థల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు 30శాతం వేతనాలు పెరిగాయని, సింగరేణిలో మాత్రం పెంచలేదని, సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చూపాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, ఉపప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి అక్బర్‌అలీ, ఐఎఫ్‌టీయూ నాయకులు బ్రహ్మానందం, రవీందర్, రాజేందర్, రవి, సాయి, శంకర్, అప్పలరాజు, సత్తయ్య, సరోజన, కోమల, శ్రీలత, మల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరికరాలతో నాణ్యమైన వైద్యం: సీఎండీ



ఆరోగ్య కరదీపికను ఆవిష్కరిస్తున్న సీఎండీ

శ్రీరాంపూర్, జనవరి 13: సింగరేణిలో పనిచేసే కార్మికులు, వారికుటుంబాలకు ఆధునిక పరికరాలతో నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. శనివారం ఆయన నస్పూర్ సింగరేణి డిస్పెన్సరీలో డిజిటల్ ఎక్స్‌రేమిషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్మికుల కోసం అన్ని డిస్పెన్సరీలలో ఆధునిక పరికరాలు అమరుస్తున్నామన్నారు. దీనికి ఎంత ఖర్చయినా వేనకాడబోమన్నారు. ఇందులో భాగంగా డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభించామన్నారు. దీనిద్వారా ఎక్స్‌రేలో ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. కార్మికకుటుంబాలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర వసతులు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా నిరంతరం కొనసాగాలన్నారు. అవసరమైన ప్రణాళికలు సిద్ధంచేసు కోవాలని సూచించారు. అనంతరం డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు రూపొందించిన ఆరోగ్య కరదీపికను ఆవిష్కరించారు. ఇందులో ఉన్న సూచనలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీఎం(పర్సనల్) హన్మంతరావు, ఏరియా జీఎం బి సంజీవ రెడ్డి, ఎస్‌వోటు జీఎం కె రఘుకుమార్, లా మేనేజర్ శిరీషారెడ్డి, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, శంకర్‌రావు, వైద్యసిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌పీ పత్రాలు అందజేత



ఎస్ఎల్‌పీ పత్రం అందజేస్తున్న మేనేజర్

శ్రీరాంపూర్, జనవరి 13: శ్రీరాంపూర్‌లోని ఆర్కే7 గని కార్మికులకు ఎస్ఎల్‌పీపత్రాలను మేనేజర్ సాయిప్రసాద్ శనివారం అందించారు. ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి కె వీరభద్రయ్య హాజరయ్యారు. తమయూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు రావాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్, హక్కులు అందిస్తామన్నారు. ఏడేళ్లుగా అండర్‌గ్రౌండ్‌లో పనిచేసినవారికి ఎస్ఎల్‌పి పత్రాలు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్‌కార్యదర్శి కిషన్‌రావు, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నెరిమట్ల మల్లేష్, ఏరియాకార్యదర్శి మారేపల్లి సారయ్య, పిట్‌కార్యదర్శి బేర రవీందర్ పాల్గొన్నారు.

కోల్ ఇండియా లాన్‌టెన్నిస్‌లో సింగరేణికి ప్రథమ బహుమతి

మందమర్రిటౌన్, జనవరి 13: చత్తీస్‌గడ్ సౌత్ ఈస్ట్‌కోల్‌ఫీల్డ్‌లో జరుగుతున్న కోల్ ఇండియా లాన్ టెన్నిస్ డబుల్స్‌లో శనివారం జరిగిన పోటీలో సింగరేణి జట్టు ప్రథమబహుమతి సాధించింది. తిరుమల, చంద్రశేఖర్ మంచిప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించారు. అదేవిధంగా సింగిల్స్ వెటరన్‌విభాగంలో వెంకటేశ్వర్లు రన్నర్‌గా నిలిచాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను తోటి క్రీడాకారులు, అధికారులు అభినందించారు. టీం మేనేజర్‌గా వ్యవహరించిన మాస్కుల కార్తీక్, కోచ్ రమేష్‌ను ఏరియా జీఎం మనోహర్, అధికారులు అభినందించారు.



పతకాలు సాధించిన సింగరేణి క్రీడాకారులు